క్లుప్తంగా

భయపెడుతున్న శునకాలు



పట్టణ వీధుల్లో కలియ తిరుగుతున్న శునకాలు

పాలకొండ రూరల్: పట్టణంలో ఏ వార్డులో చూసినా కుక్కల గుంపులు స్థానికులను హడలెత్తిస్తున్నాయి. గడచిన పది రోజులుగా వీధుల్లో ఎక్కడ చూసినా శునకాలు పాదచారులు, వాహనచోదకులపై దాడులకు పాల్పడుతున్నాయి. పండగల నేపథ్యంలో పట్టణంలో జనాల సందడి చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఇళ్ల నుంచి బయకు వచ్చే చిన్నారులు, వృద్ధులు, ఒంటరిగా వెళ్లే వారిపై దాడి చేస్తున్నాయి. ఈ సమస్యపై నగర అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని పట్టణ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సన్మానం



అడ్డాయిని సన్మానిస్తున్న నల్లరాయిగూడ ఉద్యోగులు

భామిని: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన నల్లరాయిగూడకు చెందిన ప్రొఫెసర్ బిడ్డిక అడ్డాయిని మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఆదివాసీ గిరిజన కుటుంబంలో పుట్టిన అడ్డాయి అంచెలంచెలుగా ఎదిగారని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో పలువురు గిరిజన ఉద్యోగులు పాల్గొన్నారు.

బంగారు గొలుసు మాయం!

పార్వతీపురం రూరల్: పట్టణానికి చెందిన ఓ మహిళ కొనుగోలు చేసిన కొద్దిసేపటికే తన అరతులం బంగారు గొలుసును పోగొట్టుకుంది. కురుపాంకు చెందిన తంగుడు లక్ష్మి పట్టణంలో గల ఓ నగల దుకాణంలో చైన్ కొనుగోలు చేసి, తన బట్టల బ్యాగులో భద్రపరుచుకుంది. అనంతరం తిరుగు ప్రయాణం కోసం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకుని బస్సు ఎక్కాక బ్యాగును పరిశీలించగా, అందులో బంగారు చైన్ కనిపించలేదు.

అయ్యప్ప సన్నిధానం నిర్మాణానికి భూమిపూజ

సీతానగరం: మండలంలోని బగ్గందొరవలస కంతపోలమ్మ అమ్మవారి ఆలయం ప్రాంగణంలో ఆదివారం అయ్యప్ప సన్నిధానం నిర్మాణానికి స్థానిక గురుస్వామి, సర్పంచ్ నారాయణ రావు భూమిపూజ చేశారు. ఈ మేరకు నిర్వాహకుడు, సర్పంచ్ నారాయణరావు మాట్లాడుతూ దసరా ఉత్సవాల అనంతరం అయ్యప్ప మాలలు వేయనున్నందున అయ్యప్ప భక్తులకు సన్నిధానం నిర్మాణం ప్రారంభించామన్నారు. దీర్ఘకాలంగా సన్నిధానం నిర్మించాలని సంకల్పించడంతో నేటికి పని పూర్తవుతోందని తెలియజేశారు.

వరి పంటకు..
మూషికాలతో ముప్పు..

- పంటలను దెబ్బతీస్తున్న ఎలుకల గుంపులు
- సామూహిక నివారణ చర్యలతో ప్రయోజనం

పాలకొండ రూరల్:

పంటలపై మూషికాలు దాడి చేస్తూ అన్నదాతను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరిపంట పొట్ట దశకు చేరుకుంది. ఈ తరుణంలో తీపిగా ఉండే వరి దుబ్బు, పిలకలను ఎలుకలు తినేస్తుండడంతో ఆ ప్రభావం దిగుబడిపై పడుతోంది. ఈ నేపథ్యంలో ఎలుకల బారి నుంచి వరి పైరును ఎలా సంరక్షించుకోవాలో వ్యవసాయ శాఖాధికారులు సూచిస్తున్నారు. వరిలో తేలిక రకాలు, పలు చోట్ల వెదజల్లు పద్ధతి అవలంభించడంతో ఈ రకం వంగడాలు వేగంగా పెరిగి దుబ్బు కట్టే దశకు చేరుకున్నాయి. పిలకలు, పొట్ట తీపిగా ఉండడంతో ఎలుకలు వాటిని కొరికి బొరియల్లోకి తీసుకెళ్తున్నాయి. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో నివారణపై దృష్టి సారించాల్సి ఉంది.



ఎలుకల వల్ల నష్టపోనున్న పొట్ట దశలో ఉన్న వరి

ఏం చేయాలంటే..

- సామూహిక ఎలుకల నివారణకు బ్రోమోడయాలిన్ రెండు శాతం మందును ఉపయోగించి సత్ఫలితాలను పొందవచ్చు.
- బ్రోమోడయాలిన్ 0.25 మిల్లీలీటర్ల ఎలుకల మందు రెండు శాతం విషపు ఎరగా తయారీ చేసుకోవడం కోసం 96 శాతం నూకలు, రెండు గ్రాముల నూనె, రెండు గ్రాముల బ్రోమోడయోలిన్ మందు కలిపాలి.
- విషపు ఎర తయారు చేసే సమయంలో రైతులు చేతులకు గ్లౌజులు లేదా పాలిథిన్ సంచి తొడుక్కోవాలి. లేదంటే మందులో ఉండే మనిషి చేతి వాసనను ఎలుక పసిగట్టి ఎరను స్వీకరించదు.
- ఒక్కో ఎలుక బొరియకు 10 గ్రాముల ఎరను కాగితంలో పొట్లంగా చుట్టి బొరియల్లో అంగుళం లోపల పెట్టాలి. పొట్లాలు అమర్చిన అనంతరం బొరియను మూసి వేయకూడదు భారీ, మోస్తరు వర్షం గాని వస్తే వర్షం ఆగే వరకూ వేచిచూడాలి. లేదంటే మరుసటి రోజుకు వాయిదా వేసుకోవాలి. ఎర మందు వర్షంలో తడిస్తే సరిగా పని చేయదు.
- కలిపిన ఎర మందు 12 గంటలు దాడితే ఆ వాసనను ఎలుకలు పసిగడతాయి. కాబట్టే ఈ మిశ్రమాన్ని మధ్యాహ్నం కలిపి సాయంత్రం లోపు అమర్చాలి. ఎలుకలు సాయంత్రం నుంచి మరుసటి రోజు ఉదయం వరకూ స్వీకరించే అవకాశం ఉంటుంది.
- మందు తిన్న నాలుగు నుంచి ఐదు రోజుల్లో ఎలుక చనిపోతుంది. ఈ మందు తిన్న ఎలుకల రక్తం గడ్డ కట్టదు. అవి రక్త స్రావమై, రక్త హీనతతో చనిపోతాయి.

పొగ పెట్టాలి...

పొగబారించే యంత్రం (బర్రోప్యూమి గేటర్)తో ఎలుక బొరియలను కప్పి రెండు నుంచి మూడు నిమిషాలు పొగ పెడితే వాటిలో ఉంటే తల్లి, పిల్ల ఎలుకలు పూర్తిగా చనిపోతాయి. తొలకరి చినుకుల అనంతరం పంట భూమిని దుక్కి చేయాలి. రైతులు పొలం గట్లపై కాకుండా పోరంబోకు భూములు, ఖాళీ ప్రదేశాల్లో విషపు ఎరను పెట్టి ఎలుకల నివారణ చర్యలు చేపట్టాలి. ఎలుక బొరియలను ఎప్పటికప్పుడు గమనిస్తూ పొగ పెట్టడం మంచిది.

నివారణే సరైన మార్గం ..



కీలక దశలో ఎలుకల కారణంగా పంటకు తీవ్ర నష్టం కలిగే అవకాశం ఉంది. రైతులు దీనిపై దృష్టి సారించి సామూహికంగా ఎలుకలను నిర్మూలించేలా చర్యలు చేపట్టాలి. ఇందుకు ఎన్నో పద్ధతులున్నాయి. విషపు ఎరలు పెట్టడంతో పాటు ట్రాప్‌లు, పొగ పెట్టడం వంటివి చేయాలి. రైతులు యాజమాన్య పద్ధతుల్లో భాగంగా ఎలుకలను నివారించుకోవాలి. వరి దుబ్బులు తీపిగా ఉండడంతో పొట్ట దశలోనే ఎలుకలు వీటిని కొరికి రైతులకు నష్టం కలిగిస్తాయి. బొరియలను గుర్తించి అందులో విషపు ఎరలు, ట్రాప్‌లు ఏర్పాటుచేసుకోవాలి. ఎలుకల బుట్టలను సైతం ఉంచితే అవి చిక్కి పొలాల్లోకి వెళ్లవు. – ఎస్‌వీవీఆర్ ప్రసాద్, మండల వ్యావసాయాధికారి, పాలకొండ

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటాం..

- డిజిటల్ బుక్ ఆవిష్కరణలో ఎమ్మెల్సీ విక్రాంత్



డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

పాలకొండ: కూటమి ప్రభుత్వంతో నష్టపోయిన ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి కార్యకర్తల కోసం సిద్ధం చేసిన డిజిటల్ బుక్ ను పాలకొండలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి పాలనపై దృష్టి పెట్టకుండా కేవలం కక్షసాధింపు చర్యలు చేపడుతుందని ఆరోపించారు. సంక్షేమం, అభివృద్ధి గురించి పట్టించుకోకుండా కేవలం స్వార్థ రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. ఈ అరాచక పాలనలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సామాన్య ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఇటువంటి వారి సమస్యలను డిజిటల్ బుక్‌లో నమోదు చేస్తున్నామని తెలిపారు. పార్టీ అధికారంలోనికి వచ్చిన వెంటనే కార్యక్తలకు న్యాయం చేస్తామని.. ఇప్పటికే ఈ విషయాన్ని జగన్ మోహనరెడ్డి స్పష్టం చేశారన్నారు. కార్యకర్తలు తమకు జరిగిన అన్యాయాన్ని ఈ డిజిటల్ బుక్‌లో క్యూఆర్ కోడ్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ఆయనతో పాటు వెలమల మన్మథరావు, కనపాక సూర్యప్రకాశరావు, దమలపాటి వెంకటరమణనాయుడు, దుప్పాడ పాపినాయుడు, ఎదు లిల్లీపుష్పనాథం, నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యక్తలు పాల్గొన్నారు.

అన్నను దూషించినా పవన్ కల్యాణ్‌కు పట్టదా..



కుంబురుక దీనమయ్య

గుమ్మలక్ష్మీపురం: హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ అసెంబ్లీలో చిరంజీవిని ఇష్టానుసారంగా దూషించినా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు పట్టక పోవడం సిగ్గుచేటని ఎంపీపీ కుంబురుక దీనమయ్య అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మెగాస్టార్ చిరంజీవిని ఇంటికి పిలిచి భోజనం పెట్టి ఆత్మీయత కనబరిచినా.. అవమానించారని పవన్‌కల్యాణ్ తప్పుడు ప్రచారం చేసి ఎన్నికల్లో లబ్ధి పొందారన్నారు. తాజాగా అసెంబ్లీలో ఎమ్మెల్యే బాలకృష్ణ అవమానించినా, ఎందుకు నోరు మెదపడం లేదో అర్థం కావడం లేదన్నారు. పవన్‌కు అన్న గౌరవం కన్నా పదవే ముఖ్యంలా ఉందని ఎద్దేవా చేశారు. బాలకృష్ణకు ఇతరులను విమర్శించే స్థాయి లేదని, వెంటనే ఆయన మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి, హీరో చిరంజీవికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి

వీరఘట్టం: మండలంలోని చిట్టపులివలస ప్రాథమిక పాఠశాలలో భగత్‌సింగ్ జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయుడు సాకేటి రాంబాబు మాట్లాడుతూ.. భగత్‌సింగ్ పోరాటపటిమను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద విద్యార్థులతో కలసి నివాళులు అర్పిస్తున్న రాంబాబు మాస్టారు

పెన్షనర్ల సంఘ నూతన కమిటీ ఎన్నిక

కురుపాం: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మండల కేంద్రంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు గంట జగన్నాథం పర్యవేక్షణలో జరిగిన ఎన్నికలో మండల కార్యవర్గ నూతన అధ్యక్షుడిగా పి. పాండురంగ, ప్రధాన కార్యదర్శిగా టీవీఎస్ఎస్ సోమయాజులు, కోశాధికారిగా రామకృష్ణరావుతో పాటు మొత్తం 28 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

నవయుగ చక్రవర్తి జాషువా..

పాలకొండ రూరల్:

నవయుగ చక్రవర్తి గుర్రం జాషువా అని పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు అన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ నేతృత్వంలో జాషువా జయంతి కార్యక్రమం కళాశాలలో ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. సామాజిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఆయన ఎన్నో రచనలు చేశారన్నారు. కుల ఆధారిత వివక్షతను తన రచనలతో పారదోలాడని కొనియాడారు. తెలుగు విభాగాధిపతి గురవయ్య మాట్లాడుతూ.. కవి కోకిల జాషువా రచనల విశిష్టతను వివరించారు. అంతకు ముందుకు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



జాషువా రచనల విశిష్టతను వివరిస్తున్న ప్రిన్స్‌పాల్ శ్యాంబాబు

పూర్వ విద్యార్థుల కలయిక

గరుగుబిల్లి: మండలంలోని నాగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006 – 07లో పదో తరగతి చదువుకున్న వారంతా పాఠశాల ఆవరణలో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చిన్ననాటి సంగతులను గుర్తు చేసుకుంటూ సందడిగా గడిపారు.



పూర్వపు విద్యార్థులు

అలరించిన నృత్య ప్రదర్శన

పాలకొండ రూరల్: విజయదశమి సందర్భంగా స్థానిక కోటదుర్గమ్మ దేవస్థానం వద్ద వివిధ ప్రాంతాలకు చెందిన చిన్నారులు నృత్య ప్రదర్శనలతో అలరించారు. శివకేశవ నృత్య శిక్షణ కేంద్రం చిన్నారులు భరతనాట్యంతో పాటు సామాజిక, జానపద, పౌరాణిక, సాంస్కృతిక ఘట్టాలను కనులవిందుగా అభినయించారు.



చిన్నారుల నృత్య ప్రదర్శన

ఇసుకగూడ సమీపంలో ఏనుగుల గుంపు

భామిని: మండలంలోని ఇసుకగూడ సమీపంలో ఏనుగుల గుంపు ఆదివారం కనిపించింది. గ్రామ సమీపంలోని మొక్కజొన్న పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. దీంతో బాధిత రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు.



మొక్కజొన్న పంటలో ఏనుగులు

పొలం గట్లపై కూరగాయల పంట

సీతానగరం: మండలంలో ఖరీఫ్ వరి పంట సాగు చేస్తున్న పొలం గట్లపై రైతులు వివిధ రకాల ఆకుకూరలు, కాయకూరల పంటలను సాగు చేస్తున్నారు. ఈ మేరకు వెంకటాపురం, లక్ష్మీపురం, బగ్గందొరవలస తామరఖండి, బుడ్డిపేట గ్రామాల్లో రైతులు వరిచేను పొలం గట్లపై బెండ, చిక్కుడు, వంకాయ పంటలు వేసి ఇంటికి సరిపడా కూరగాయలు పండిస్తున్నారు.

200 మంది రోగులకు వైద్యపరీక్షలు

మక్కువ: స్థానిక ఎస్ఎస్.పాఠశాలలో బొబ్బిలికి చెందిన సంజీవిని ఎముకలు, చర్మవ్యాధుల ఆస్పత్రి వైద్యులు ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు బంకురు భరత్‌కుమార్, పి.లోహిసాయి రాజ్యలక్ష్మి 200 మంది రోగులకు వైద్యపరీక్షలు చేసి అవసరమైన మందులు అందించారు.



భామిని: పాలజంగిడితో భక్తుల ఊరేగింపు



కురుపాం: పూజలందుకుంటున్న కోటకొండ దుర్గమ్మ



కురుపాం: డప్పువాయిద్యాలతో భక్తుల ఊరేగింపు

ఘనంగా కోటకొండ దుర్గమ్మ ఉత్సవాలు

కురుపాం: మండలంలోని జి.శివడ పంచాయతీ గిరి శిఖర గ్రామమైన కోటకొండలో దుర్గమ్మ ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అటు భామిని మండలం నుంచి ఇటు కురుపాం మండల ప్రజలు దుర్గమ్మను ఆరాధ్యదైవంగా భావిస్తారు. గిరిజనులు తమ ఇంట్లో జరిగే ప్రతి శుభకార్యానికి ముందుగా దుర్గమ్మను దర్శించుకుని పూజలు చేయడం పురాతనకాలం నుంచి సంప్రదాయంగా వస్తోంది. మేళతాళాల నడుమ అమ్మవారి గుడికి చేరుకుని పసుపు, కుంకుమలు సమర్పించారు.

భక్తి శ్రద్ధలతో దుర్గమ్మ సంబరం..

వీరఘట్టం: దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని స్థానిక రుషి విజ్ఞాన యోగా కేంద్రం సభ్యులు దుర్గమ్మ సంబరాన్ని ఘనంగా నిర్వహించారు.108 మంది మహిళలు ఘటాలతో వీరఘట్టం ప్రధాన రహదారి మీదుగా మేళతాళాలు, దేవతా మూర్తుల వేషధారణల నడుమ ర్యాలీగా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు.



వీరఘట్టం: ఘటాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

మహాచండి అలంకరణలో..

పాలకొండ: దసరా ఉత్సవాల్లో భాగంగా స్థానిక కోటదుర్గ ఆలయంలో అమ్మవారు మహాచండి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో చేరుకోవడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది.

గుమ్మలక్ష్మీపురంలో..

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాన్ని ఏడో రోజైన ఆదివారం మహాచండి అవతారంగా తీర్చిదిద్దారు. భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు.

మహాచండీ నమోస్తుతే...

పాలకొండ రూరల్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పురటాల పోలమాంబ అమ్మవారు మహాచండి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు వేమకోటి రవికుమార్ నేతృత్వంలో అమ్మవారికి విశేష అలంకరణలు, అర్చనలు చేపట్టారు. నక్కలపేటలో కొలువైన అష్టాదశ శక్తి పీఠాలను దర్శించుకునేందుకు స్థానికులకు పోటెత్తారు. అర్చకుడు శరత్‌కుమార్ పర్యవేక్షణలో అమ్మవార్లకు సామూహిక కుంకుమార్చనలు జరిగాయి.

కోటకొండలో ..


భామిని: మండలంలోని తివ్వాకొండ శివారులో గల కోటకొండ గిరిజన గ్రామంలో దసరా వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి గిరిజనులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే భామిని దొరలు కీర్తిరాయి వంశస్తులు ప్రజల జయజయధ్వానాల నడుమ తివ్వాకొండకు చేరుకుని పూజలు చేశారు.



పాలకొండ రూరల్: మహాచండీగా భక్తులకు దర్శనమిస్తున్న పోలమాంబ



వీరఘట్టం: ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన వీరఘట్టం ఇలవేల్పు కోటదుర్గ



పాలకొండ: మహాచండి అలంకరణలో కోటదుర్గమ్మ



గుమ్మలక్ష్మీపురం: చండీ అవతారంలో ఉన్న దుర్గాదేవికి పూజలు చేస్తున్న భక్తులు

దుర్గమ్మకు 108 రకాల ప్రసాదం..



కురుపాం మండల కేంద్రంలోని రావాడ కూడలిలో వెలిసిన కోట దుర్గమ్మకు శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం 108 రకాల ప్రసాదాలతో నైవేద్యం పెట్టారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. – కురుపాం